సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

బెంచ్ ప్రెస్ పోటీల విజేతలకు సత్కారం



విజేతలను సత్కరిస్తున్న స్వామి ఫిట్‌నెస్ జిమ్ ప్రతినిధులు

పెదగంట్యాడ: బెంగళూరులో ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహించిన 28వ నేషనల్ బెంచ్ ప్రెస్ పోటీల్లో పెదగంట్యాడ స్వామి ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటారు. 150 కిలోల విభాగంలో ఏవై ప్రసాద్ ద్వితీయ స్థానంలో, 112.50 కిలోల విభాగంలో రాము తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలను స్వామి ఫిట్‌నెస్ జిమ్ కోచ్‌లు తాతారావు, గురుమూర్తి మంగళవారం అభినందించి సత్కరించారు.

గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల 16వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం కేంద్ర గౌరీ సేవా సంఘం ప్రతినిధులు హాజరై శ్రీ గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దాడి వెంకట రమేష్, ప్రధాన కార్యదర్శి కాళ్ల రాజబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు శరగడం అప్పల నాయుడు, కోయిలాడ రమణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ రుక్మాంగదరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ క్రైం ఎస్‌ఐగా టి. రుక్మాంగదరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నగర కమిషనర్ రవి శంకర్ అయ్యర్ చేసిన రెగ్యులర్ బదిలీల్లో ఇక్కడి క్రైం ఎస్‌ఐ ఎల్. శ్రీనివాసరావును బదిలీ చేశారు. ఆ స్థానంలో రుక్మాంగదరావు విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఆయన ఆరిలోవ పోలీస్ స్టేషన్ క్రైం ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఇందుకు ప్రజల నుంచి సహకారం ఆశిస్తున్నామన్నారు.

క్రైం ఎస్‌ఐగా మన్మథరావు బాధ్యతల స్వీకరణ



అక్కిరెడ్డిపాలెం: గాజువాక క్రైం విభాగం నూతన ఎస్‌ఐగా అంపోలు మన్మథరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్లిన మహేశ్వరరావు స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆనందపురం క్రైం విభాగం నుంచి మన్మథరావు గాజువాకకు బదిలీపై వచ్చారు.

చికిత్స పొందుతూ విశాఖ డెయిరీ వర్కర్ మృతి



పేతురు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి చెందిన తెనాలి పేతురు (56) విశాఖ డెయిరీలోని బై ప్రొడక్షన్‌లో వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నెల 8వ తేదీన క్లీనింగ్ పనులు చేస్తుండగా క్యాస్టిక్ సోడా మిక్సింగ్‌తో కూడిన వేడి నీరు ప్రమాదవశాత్తు అతనిపై పడింది. దీంతో అతని శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందగా పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు. నష్టపరిహారం చెల్లించి, తండ్రి ఉద్యోగాన్ని కుమారుడు కరుణ్ కుమార్‌కు ఇవ్వాలని మృతుని బంధువులు డిమాండ్ చేశారు. దీనికి యాజమాన్యం సానుకూలంగా స్పందించి మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని బంధువులు తెలిపారు.

కొండంత ధైర్యం

నాడు: కొండలపై ఉన్న తమ ఇళ్లకు వెళ్లేందుకు సరైన దారి లేక కొండవాలు ప్రాంత ప్రజలు ఆందోళన చెందేవారు. ఏదో విధంగా ఇంటికి చేరుకున్నా రక్షణ గోడలు లేకపోవడంతో బిక్కుబిక్కుమనేవారు. దేవుడిపై భారం వేసి భారంగా మెలిగేవారు.

నేడు: కొండవాలు ప్రాంతాల్లో పరిస్థితులు మారాయి. ఎక్కడికక్కడ మెట్ల మార్గాలు రూపుదిద్దుకుంటున్నాయి. అవసరమైన చోట రిటైనింగ్ వాల్స్ (రక్షణ గోడలు) అందుబాటులోకి వస్తున్నాయి. ప్రజలు ధైర్యంగా ఉండగలుగుతున్నారు.

ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు మేలు చేయడమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోను మౌలిక వసతులు కల్పిస్తున్నారు. విద్య, వైద్యంతో పాటు మిగిలిన అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ పేదల బతులకు భరోసా కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గాజువాకలోని కొండవాలు ప్రాంతాల ప్రజల సమస్యకు పరిష్కారం చూపారు. నివాసాలపై కొండ చరియలు విరిగి పడకుండా రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, రాకపోకలకు వీలుగా మెట్ల మార్గాలు నిర్మించి అక్కడి ప్రజలు నిశ్చింతగా బతికే అవకాశం కల్పించారు.

- కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులు
- రిటైనింగ్ వాల్స్ నిర్మాణంతో స్థానికులకు భరోసా



డ్రైవర్స్ కాలనీలో నిర్మించిన రిటైనింగ్ వాల్

గాజువాక: ప్రస్తుతం గాజువాకలో పరిస్థితి ఇది. జీవీఎంసీ పాలకవర్గం అభివృద్ధికి పెద్దపీట వేసింది. అన్ని వార్డుల్లోను మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చింది. ప్రతి వార్డుకు కోట్ల రూపాయల్లో నిధులు మంజూరు చేయడంతో ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయి. ప్రధానంగా కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులు అందుబాటులోకి తెచ్చింది. కొన్ని నిర్మాణాలు ఇప్పటికే పూర్తి కాగా, మరికొన్ని నిర్మాణ దశలోను, ఇంకొన్ని టెండరు దశలోను ఉన్నాయి.

- 70వ వార్డు ఎల్‌బీఎస్ నగర్, దశమికొండ కొండవాలు ప్రాంతాల్లో కొండ చరియల నుంచి రక్షణ కల్పించడం కోసం రూ.30 లక్షలతో రిటైనింగ్ వాల్స్ నిర్మించారు.
- ఎల్‌బీఎస్ నగర్ కొండవాలు ప్రాంతంలో రూ.15 లక్షలతో మెట్ల మార్గం అందుబాటులోకి తెచ్చారు.
- చిట్టినాయుడు కాలనీ, దశమికొండ కాలనీ కొండవాలు ప్రాంతంలో రూ.20 లక్షలతో మెట్ల మార్గం నిర్మించారు.
- డ్రైవర్స్ కాలనీ కొండవాలు ప్రాంతంలో 20 లక్షలతో మెట్ల మార్గం నిర్మాణం పూర్తి చేశారు.
- 71వ వార్డు అరుణోదయ కాలనీలో రూ.25 లక్షలతో మెట్ల మార్గం నిర్మించారు.
- సుందరయ్య కాలనీలో రూ.20 లక్షలతో మెట్లను అందుబాటులోకి తెచ్చారు.
- నాగనూకమాంబ కాలనీలో రూ.20 లక్షలతో మెట్ల మార్గాన్ని నిర్మించారు.
- శివసాయినగర్‌లో రూ.10 లక్షలు, శ్రీరామ్‌నగర్‌లో రూ.27.85 లక్షలతో మెట్లను అందుబాటులోకి తెచ్చారు.



ఎల్‌బీఎస్ నగర్‌లో రిటైనింగ్ వాల్‌పై నిర్మించిన రోడ్డు

కొండవాలు ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి ఇదీ..

- ఎల్‌బీఎస్ నగర్, దశమికొండ కొండవాలు ప్రాంతాల్లో రూ.30 లక్షలతో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం
- ఎల్‌బీఎస్ నగర్ కొండవాలు ప్రాంతంలో రూ.15 లక్షలతో మెట్ల మార్గం నిర్మాణం
- చిట్టినాయుడు కాలనీ, దశమికొండ కాలనీ కొండవాలు ప్రాంతంలో రూ.20 లక్షలతో మెట్ల మార్గం నిర్మాణం
- డ్రైవర్స్ కాలనీ కొండవాలు ప్రాంతంలో రూ. 20 లక్షలతో మెట్ల మార్గం నిర్మాణం
- అరుణోదయ కాలనీలో రూ.25 లక్షలతో మెట్ల మార్గం నిర్మాణం
- సుందరయ్య కాలనీలో రూ.20 లక్షలతో మెట్ల మార్గం నిర్మాణం
- నాగనూకమాంబ కాలనీలో రూ.20 లక్షలతో మెట్ల మార్గం నిర్మాణం
- శివసాయినగర్‌లో రూ.10 లక్షలతో మెట్లమార్గం నిర్మాణం
- శ్రీరామ్‌నగర్‌లో రూ.27.85 లక్షలతో మెట్లమార్గం నిర్మాణం

నిశ్చింతగా ఉన్నాం..



కొండవాలులో నివాసం ఉంటున్నాం. వర్షం వస్తే కొండ చరియలు ఎక్కడ పడతాయోనని భయంగా ఉండేది. గతంలో తుపానుకు మా ప్రాంతంలో ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని మా కార్పొరేటర్ చందు స్వయంగా చూసి స్పందించారు. వెంటనే రక్షణ గోడ నిర్మించారు. ఇప్పుడు మాకు ధైర్యంగా ఉంది.

– పద్మ, డ్రైవర్స్ కాలనీ

మౌలిక వసతులు కల్పించారు..



కొండవాలులో ఉంటున్న మా ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించారు. రాకపోకల కోసం కొండ పైకి మెట్ల మార్గాలు వేశారు. మంచినీటి కొరత లేకుండా చర్యలు చేపట్టారు. రిటైనింగ్ వాల్ నిర్మించడం వల్ల భయం లేకుండా ఉన్నాం. మాకు ఇతర ప్రాంతాల మాదిరిగా అన్ని వసతులు సమకూరుతున్నాయి.

– రాజేశ్వరమ్మ, ఎల్‌బీఎస్ నగర్



ఎల్‌బీఎస్ నగర్‌లో అందుబాటులోకి తెచ్చిన మెట్ల మార్గం

జ్యోతిరావు పూలే సేవలు ఎనలేనివి



పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు



కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: బీసీ సామాజిక వర్గానికి జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పల్లా పెంటారావు ఆధ్వర్యంలో బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే పూల మాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, రోజారాణి, ప్రమీల, మంజుల, కల్పన, సంపంగి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- ఏపీ బీసీ సంక్షేమ సంఘం గాజువాక అధ్యక్షుడు జాగారపు శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి న్యూపోర్టు ఎస్‌ఐ శ్రీనివాస్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన వై.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులు అందజేశారు.
- పెదగంట్యాడ జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సంపంగి ఈశ్వరరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం జంక్షన్‌లోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నేటి రమణ, గంగులూరి రోజారాణి, కల్పన, ఉమాదేవి పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

పూలేకు వైఎస్సార్‌టీయూసీ నివాళి..

ఉక్కునగరం: బీసీల ఆరాధ్యదైవం జ్యోతిరావు పూలేకు స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు నివాళి అర్పించారు. పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై. మస్తానప్ప, మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థనగర్‌లో..

కూర్మన్నపాలెం: మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి సిద్ధార్థనగర్‌లో బలిరెడ్డి నాగేశ్వరరావు, జేఎస్ మూర్తి, సూర్యనారాయణ, సుందర్‌మూర్తి, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ, కృష్ణనాయక్, అప్పారావు తదితరులు నిర్వహించారు.

రూ.44.78 లక్షలతో అభివృద్ధి పనులు


కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో రూ.44.78 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. రాజులపాలెం అల్లూరి పార్కులో రూ.35లక్షలతో సామాజిక భవనం, కణితి వడ్లపూడి మెయిన్‌రోడ్‌లో రూ.9.78 లక్షలతో రోడ్డు మరమ్మతులు పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. గాజువాక జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ బొండా జగన్నాథం, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, శీరపు పాపారావు, దుగ్గపు దానప్పలు, వడ్లపూడి ఈశ్వరరావు, కోనేటి పారిపల్లి, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఉక్కు ఉద్యమం భవిష్యత్ తరానికి స్ఫూర్తి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1020వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు కూర్చొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడారు. రైతులు సాగించిన పోరాటం ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని.. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటం చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ.. దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



రిలే దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సారథ్యంలో అనాథ బాలల ఆశ్రమానికి పప్పులుండలు, ఖర్జూరం వంటి పౌష్టికాహారం అందించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, సీఈవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగనే మళ్లీ సీఎం కావాలని ప్రజల ఆకాంక్ష

పెదగంట్యాడ: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీ సచివాలయ పరిధిలో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ అదేస్థానంలో చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ముందుగా వాంబేకాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించే డిజిటల్ బోర్డును సచివాలయ ఆవరణలో ప్రారంభించారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను, నాయకులు లోకనాథం, నాగిశెట్టి శ్రీను, మంగునాయుడు, జుత్తు లక్ష్మీ, పెంద్ర రాజు, రాంబాబు, రమణ, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో సంక్షేమ పాలన ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, మళ్లీ ముఖ్యమంత్రిగా ఆయన్ని గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్ రెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం సచివాలయం-2 పరిధిలో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాతయ్యపాలెం సచివాలయం -2 పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.25,03,43,957 అందజేసినట్లు చెప్పారు. అనంతరం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాజువాక జెడ్సీ పి.సింహాచలం, వార్డు మహిళా అధ్యక్షురాలు కమరున్నీసా బేగం, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, గాజువాక ఇన్‌చార్జి మహ్మద్ గౌస్, క్లస్టర్ ఇన్‌చార్జి అచ్చిలినాయుడు, నాయకులు గండ్రెడ్డి రామునాయుడు, చినసన్యాసిరావు, మళ్ల కుమార్, శశిభూషణ రావు, బోగాది అప్పారావు పాల్గొన్నారు.



సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


గణేష్‌నగర్ సచివాలయ-2 పరిధిలో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు గణేష్‌నగర్ సచివాలయ-2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండా ఎగురవేసి, సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, మండల అధ్యక్షులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, జెర్రిపోతుల ఈశ్వరరావు, ఆడారి శ్రీను, బొండా గోవిందరాజులు, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



గణేషనగర్ సచివాలయ-2లో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఘనంగా కార్తీక మాస పూజలు



పారాయణలో పాల్గొన్న బొర్రమాంబ పారాయణ సమితి ప్రతినిధులు

అగనంపూడి: కార్తీక మాసం మూడవ మంగళవారం సందర్భంగా అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి సారథ్యంలో సత్తెమ్మతల్లి ఆలయంలో మహిళా బృందం పారాయణ చేసింది. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సారెలను కానుకగా సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, పారాయణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణపై విద్యార్థినులకు అవగాహన

గాజువాక: విద్యార్థినుల ఆరోగ్య రక్షణపై స్థానిక చైతన్య మహిళా కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర లయన్స్ ఎడ్యుకేషన్ ట్రస్టు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రుతుస్రావం, రొమ్ము క్యాన్సర్, ఆందోళన తదితర అంశాలపై డాక్టర్ వి.సూర్యప్రభ పలు అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆపన్నహస్తం

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసకు చెందిన శ్రీనాథుని జశ్వంత్, ప్రణీత్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో ప్రణీత్ కాలేయం తొలగించారు. జశ్వంత్ మంచాన పడ్డాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముల కష్టాన్ని తెలుసుకున్న సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు బలిరెడ్డి వెంకటేష్, ఇతర మిత్రుల సహాయంతో రూ.15 వేల నగదును సహాయంగా అందించారు. సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ మూడు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులు అందించి ఉదారతను చాటుకుంది. చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుడే సుశీలా గజేంద్రరావు, జామి గణేష్, కొండలరావు, నరేష్, కిడిమి హనుమంతరావు, అప్పారావు, రాము జోగారావు పాల్గొన్నారు.



బాధితునికి ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు

స్టీల్‌ప్లాంట్ జీఎం సింగ్‌కు ఘన సత్కారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెంటర్ ఫర్ ఇండస్ట్రీ (సీఎఫ్ఐ) జనరల్ మేనేజర్ ఎస్.ఎస్. సింగ్‌ను కోక్ ఓవెన్స్ విభాగం ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు. సింగ్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా నాయకులు ఆయనను కలిసి శాలువాలు, పూలమాలలతో అభినందించారు. యూనియన్ ముఖ్య చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు, గోపాలరాజు, ఎ. నూకరాజు, కె. సుబ్బారావు, ఎల్లారావు, నరసింగరావు, జగన్నాథరావు, హరి, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ జీఎం సింగ్‌ను సత్కరిస్తున్న నాయకులు

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

అగనంపూడి: మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్ పత్తిపాటి సురేష్ అన్నారు. అగనంపూడిలోని రాజీవ్‌గాంధీ కల్యాణ మండపంలో ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల జాతీయ చైర్మన్ కాసాల కోనయ్య ఆదేశాల మేరకు సమాజంలో ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో చైతన్యం తీసుకురావడానికి అక్కడ కమిటీలు ఏర్పాటు చేయనున్నామన్నారు. వచ్చేనెల 10వ తేదీన మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అగనంపూడి రాజీవ్ కల్యాణ మండపంలో వివిధ సంఘ సేవకులకు సన్మానం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో మోటూరి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, ఎలుగుబంటి సత్యనారాయణ, విందుల నారాయణరావు, నారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.